
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 8 జూలై 2025



- జిల్లాల వారీగా కోడిగుడ్ల పంపిణీకి కసరత్తు
- ఎగ్ టెండర్ల నిర్వహణకు కలెక్టర్ కన్వీనర్‌గా అధికారులతో కమిటీలు
- ఈనెలాఖరు వరకు పాత కాంట్రాక్టర్ల ద్వారానే సరఫరా
- రోజూ రెండున్నర లక్షల మంది బాలింతలు, విద్యార్థులకు భోజనంలో అందజేత



జోనల్ విధానానికి స్వస్తి



ఖమ్మం, జూలై 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి నేటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంక్షేమహాస్టళ్ల, మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలకు వినియోగించే కోడిగుడ్ల టెండర్ల ప్రక్రియ జోన్ల వారీగా జరుగుతోంది. ఇకపై ఆ జోనల్ విధానానికి స్వస్తి పలికి కోడిగుడ్ల టెండర్ల ప్రక్రియను జిల్లాల వారీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ టెండర్ల ప్రక్రియను కలెక్టర్లే నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా ఐసీడీఎస్, ఎడ్యుకేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జిల్లా సంక్షేమాధికారులు గురుకులాల అధికారులతో కమిటీ గుడ్ల టెండర్లను జిల్లాస్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నెలలో రెండు సార్లు..

2022 నుంచి భద్రాద్రి జోన్ స్థాయిలో ఖమ్మం కొత్తగూడెం, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి కోడిగుడ్లు టెండర్లు ప్రక్రియ నడిచింది. అందులో భాగంగా 30కోడిగుడ్ల ట్రేతో కలిపి 1,350 గ్రాముల నుంచి 1,560గ్రాముల వరకు బరువు ఉండాలన్న నిబంధన ఉండేది. అలాగే ఒక్కో కోడిగుడ్డు బరువు 45గ్రాముల నుంచి 55గ్రాముల బరువుఉండాలి. నెలలో రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమహాస్టళ్లకు నేరుగా సరఫరా చేయాలి.

నాసిరకం గుడ్ల గుర్తింపు

కోడిగుడ్లను క్లీన్ చేయడం, వాటికి లేబుళ్లు వేయడం, నాసిరకం గుడ్లను తొలిగించడం, గ్రేడింగ్ చేసి సరఫరా చేసేలా గుడ్ల ధరల పెరుగుదలతో సంబంధం లేకుండా రవాణా చార్జీలతో కలిపి ఒక్కో కోడిగుడ్డు రూ.5.67పైసలకు సరఫరా చేశారు. ఈ ప్రక్రియతో పెద్ద కాంట్రాక్టర్లు కోడిగుడ్ల కాంట్రాక్టు పాడుకుని మళ్లీ జిల్లాల వారీగా సబ్‌కాంట్రాక్టర్లకు గుడ్ల సరఫరా చేస్తున్నారు. దీంతో కొన్నిసార్లు నాసిరకం గుడ్లు, తక్కువ బరువున్న గుడ్లు పంపిణీ చేయడం, పై స్థాయిలో ఉన్న రాజకీయ పలుకుబడితో బిల్లులుపొందడం లాంటి వాటితో దందా నడిపిస్తున్నారు. స్థానికంగా గుడ్ల ఉత్పత్తి రైతులు పెద్దకాంట్రాక్టర్లకు అడిగినంత రేటుకు ఇచ్చి మళ్లీ వీరే గుడ్లు సరఫరా చేసే పరిస్థితి ఉండడంతో గుడ్ల సరఫరాలో దళారుల ప్రమేయం జోరుగా సాగుతోంది.

సీఎం దృష్టికి సమస్య..

ఈ పరిస్థితి గురించి కొందరు గుడ్ల ఉత్పత్తిదారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జోనల్ పద్ధతి కాకుండా జిల్లాల వారీగా గుడ్ల టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. వాస్తవానికి జూన్ నెలాఖరుతో గత కాంట్రాక్టర్ల గడువు పూర్తయినా ఈ నెలాఖరు వరకు గుడ్ల ధర రూ.6పెంచి సరఫరా చేయాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో రోజూ రెండున్నర లక్షల మందికి పైగా విద్యార్థులు, బాలింతలకు గుడ్లు అందిస్తున్నారు. గుడ్ల సరఫరా రూపంలో రూ.కోట్ల వ్యాపారం నడుస్తోంది. ఇక జిల్లాస్థాయిలోనే టెండర్ల ప్రక్రియ జరగడంతో స్థానికంగా రైతులు కూడా కోడిగుడ్ల ఉత్పత్తిపైనే దృష్టిసారించే అవకాశం ఉంది. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా గుడ్ల టెండర్ల ప్రక్రియతో పాటు గుడ్ల ఉత్పత్తి, సరఫరాలో కూడా భాగస్వామ్యం అయ్యే పరిస్థితి ఏర్పడబోతుంది.

హలో.. వ్యవసాయాధికారి

రేపు రైతు సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్





వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. దుక్కులు దున్నడం మొదలు.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు, వాడకంతోపాటు పంటల సస్యరక్షణ, వాటికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. ఈసమస్యలను బుధవారం నిర్వహించే 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ ద్వారా ఖమ్మం జిల్లా వ్యవసాధికారి (జేడీఏ) డి.పుల్లయ్య దృష్టికి నేరుగా తీసుకెళ్లి పరిష్కరించుకోవవచ్చు. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే రైతు సంక్షేమ పథకాలు, రుణాల మంజూరులో ఉన్న అనుమానాలు, సాంకేతిక ఇబ్బందులను ఈ ఫోన్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యవసాయాధికారికి విన్నవించుకోవచ్చు.

ఫోన్ ఇన్ తేదీ
9-7-2025 (బుధవారం)

సెల్ నెంబరు
99854 11613

కాల్ చేయాల్సిన సమయం
ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



దేవస్థానం సిబ్బందితో పురుషోత్తపట్నం గ్రామస్థుల వాగ్వాదం

తగ్గేదే లేదు!

- నిర్మాణాలు ఆపేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి
- భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమార్కుల బరితెగింపు
- ఏపీలోని పురుషోత్తపట్నంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు
- అడ్డగించేందుకు దేవస్థానం సిబ్బంది యత్నం
- తెలంగాణ అధికారులు రావద్దని ఆక్రమణదారుల హుకుం

భద్రాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ పరిధిలో ఉన్న భద్రాద్రి దేవస్థానానికి చెందిన భూముల్లో ఆక్రమణదారులు మళ్లీ రెచ్చిపోతున్నారు. అక్రమ నిర్మాణాల విషయం తెలిసి దేవస్థానం అధికారులు, సిబ్బంది వెళ్లి నిర్మాణాలు ఆపాలని సంబంధిత వ్యక్తులకు స్పష్టం చేయగా వారు ఏ మాత్రం ఖాతరు చేయకుండా "నిర్మాణాలు ఆపేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ దేవస్థానం సిబ్బందికి స్పష్టం చేశారు. అంతే కాకుండా దేవస్థానం సిబ్బంది వెంట వెళ్లిన ఎస్‌పీఎఫ్ సిబ్బందిని సైతం బెదిరించే ప్రయత్నం చేశారు. "మీరు ఇక్కడకు ఎలా (మిగతా 6వ పేజీలో)



సాగునీటి కోసం..

- వైరా ఆయకట్టు రైతుల ఎదురుచూపు
- వానాకాలం సాగుపై ఎన్నెన్నో ఆశలు

7



సింగరేణిలో సమ్మె సైరన్

- రేపు విధులు బహిష్కరించాలని సంఘాల పిలుపు
- సమ్మెలో పాల్గొనవద్దని యాజమాన్యం ప్రచారం

6

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా వంశీచంద్



- సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా నియమించిన పీసీసీ
- వర్గపోరుతో సవాల్‌గా మారనున్న సమన్వయం

ఖమ్మం, జూలై 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : కాంగ్రెస్ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు ఇచ్చారుఉ. ఇప్పటికే ఉమ్మడిజిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామ, మండలాలతో పాటు జిల్లా కమిటీల ఎన్నికల ప్రక్రియను పార్టీ ప్రారంభించింది. ఇప్పటికే గ్రామకమిటీ అధ్యక్షుల పేర్లను ప్రతిపాదించారు. అయితే పార్టీ ఎవరిని ఇంకా అధికారికంగా నియమించలేదు. ఇన్‌చార్జ్‌గా వంశీచంద్‌రెడ్డిని నియమించడంతో త్వరలోనే ఆయన ఉమ్మడిజిల్లాలో నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు. సంస్థాగత ఎన్నికల పూర్తయ్యే వరకు జిల్లాలో వంశీచంద్‌రెడ్డి పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం ఉంది. జిల్లాలో ముగ్గురు మంత్రులతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల నియోకజవర్గాల్లో కొత్త, పాత గ్రూపుల మధ్య సమన్వయంలేదు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయులుగా కేడర్ పనిచేస్తోంది. ఈ క్రమంలో వంశీచంద్‌కు సమన్వయం సవాల్‌గా మారనుంది.

పలు చోట్ల అంతర్గత పోరు!

సంస్థాగత ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల అంతర్గత వర్గపోరు కనిపిస్తోంది. భద్రాచలంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య.. ప్రస్తుత ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు వర్గీయుల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. అలాగే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా కొత్త, పాత కేడర్ మధ్య గ్యాప్ నడుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో తొలుత సంస్థాగత ఎన్నికల ప్రక్రియను కాంగ్రెస్ పూర్తి చేసే పనిలో ఉంది. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి జిల్లాలకు డీసీసీ పీఠం దక్కించుకునే విషయంలో (మిగతా 6వ పేజీలో)



రామాలయం ప్రాంతంలో ఇళ్ల తొలగింపును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఆగమ శాస్త్రం ప్రకారం
రామాలయ అభివృద్ధి

- భద్రాద్రి రూపురేఖలు మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- త్వరలోనే భూ సేకరణ పూర్తి.. వెంటనే పనులు ప్రారంభం
- భద్రాచలం పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- రూ.1.15కోట్ల డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన

భద్రాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం భద్రాద్రి రామాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నామని, సీతారామచంద్రస్వామి ఆలయం, భద్రాచలం రూపురేఖలను మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి చర్ల రోడ్డు వరకు ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.1.15కోట్లతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్ చేపట్టే పనుల శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధి కోసం ఇటీవల రామాలయ పరిసరాల్లో నిర్మాణాలను తొలగిస్తున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే భూ సేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ ప్రక్రియ తుది దశకు చేరిందని, మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగిసిందని, ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు తీసుకెళతామన్నారు. ఏ ప్రాకారంలో ఏముండాలి అనే శాస్త్రీయపరమైన అంశాలను పాంచరాత్ర ఆగమ శాస్త్ర నిపుణులు, దేవాదాయ శాఖ స్థపతులు నిర్ణయిస్తారని వారి నిర్ణయం మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కనీసమ ఇప్పటి నుంచైనా రామాలయ అభివృద్ధి జరగాలి అనేది తన (మిగతా 6వ పేజీలో)



'మారెళ్లపాడు'తో పినపాక
సస్యశ్యామలం

- వచ్చే యాసంగికి నీరందించేలా చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పనుల నిర్వహణలో జాప్యంపై తీవ్ర ఆగ్రహం
- సంబంధిత ఏజెన్సీపై చర్యలకు ఆదేశం

7

'ప్రజావాణి'పై విశ్వాసం పెంచాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారం కావాలి
- అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు
- గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి.. ప్రజల్లో ఈ కార్యక్రమంపై విశ్వాసం పెంచాలని, ఇందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న185 ప్రజావాణి దరఖాస్తులను ఏడురోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రతీ వారం మండల అధికారులతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై సమీక్షించాలని, ఆ స్థాయిలోనే దాదాపు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. గ్రామ ప్రజలకు సంబంధించిన సామూహిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న లోపాలను గుర్తించాలన్నారు. ప్రతీ అధికారి చెక్ లిస్ట్ తయారు చేసుకొని ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఫీడ్ బ్యాక్ అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో. కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల్లో కొన్ని..

- ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామం సర్వే నెంబర్ 147, 148, 149 లో గత 11 ఏళ్లగా భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ 2 వేల కుటుంబాలకు వంద గజాలు చొప్పున ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఆధారంగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, తాగునీరు, కరెంట్ లాంటి మౌలిక వసతులు కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వుల ప్రకారం కాలనీలో తాగునీరు, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వినోబా కాలనీ వాసులు కోరారు.
- వైరా మండలం గండగలపాడు గ్రామ ప్రజలు జాతీయ రహదారి వల్ల భూములు కోల్పోయిన రైతులకు మిగిలిన భూములకు వెళ్లేందుకు దారి లేదని, జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు, పంట కాలువలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.
- చింతకాని మండలం రైల్వేకాలనీ వాసులు తమ గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనం రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములలో నిర్మించాలని, జీపీ భవనం నిర్మాణం కోసం ప్రైవేటు స్థలాలను సేకరించవద్దని కోరుతూ ఫిర్యాదు చేశారు.

స్తంభించిన మిర్చి కొనుగోళ్లు

- జాతీయ, అంతర్జాతీయ ఆర్డర్లు లేకపోవడమే కారణం
- పంటను మళ్లీ కోల్డ్ స్టోరేజీలకు తరలించిన రైతులు



మార్కెట్‌లో గుమిగూడిన రైతులు

ఖమ్మం మార్కెట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా, అంతర్జాతీయంగా మిర్చి ఆర్డర్లు లేకపోవడంతో సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు స్తంభించాయి. జెండాపాట నిర్వహించిన అనంతరం మిర్చి ఖరీదు వ్యాపారులు(ట్రేడర్లు) కనీసం ఒక్క మిర్చి బస్తాను కూడా కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు హుటాహుటిన మిర్చి కొనుగోలుదారులతో సమావేశం నిర్వహించి ఆర్డర్లు లేకపోవడానికి గల కారణాలపై సమీక్షించారు. రైతులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కావడంతో.. రైతులు సోమవారం మార్కెట్ ప్రారంభం కాగానే మథావిధిగా తాము కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న పంటను మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో 76లాట్లకు గాను సుమారు 3,500 బస్తాల ఏసీ మిర్చి యార్డులకు వచ్చింది. రోజూలాగానే ఉదయం 7గంటలకు జెండా పాట కార్యక్రమాన్ని నిర్వహించి క్వింటా ధర రూ.13,100గా నిర్ణయించారు. జెండాపాట తరువాత తమ పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పంట అమ్మకానికి తెచ్చిన రైతులు కొంత సేపు ఆందోళనకు గురయ్యారు. తమ పంటను ఎందుకు కొనుగోలు చేయట్లేదని మార్కెట్ అధికారులను సంప్రదించగా ఆర్డర్లు లేక క్రయ విక్రయాలు జరగలేదని చెప్పడంతో తమ పంటను తిరిగి కోల్డ్‌స్టోరేజీకు తరలించారు. కాగా మార్కెట్‌లో మిగితా పంటలైన పత్తి, అపరాలు క్రయ విక్రయాలు యథావిధిగా జరిగాయి.

ఇద్దరు కానిస్టేబుళ్లు సీపీ ఆఫీసుకు అటాచ్!

ఖమ్మం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇరికిస్తామంటూ ఓ మిర్చి వ్యాపారి గుమస్తాను బెదిరించిన ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఆ ఇద్దరిని సీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. గత నెల 28న నగరంలోని త్రీటౌన్ ప్రాంతం సుందరయ్య పార్కు సమీపంలో రాజస్థాన్‌కు చెందిన ఓ మిర్చి వ్యాపారి గుమస్తా వద్ద ఇద్దరు కానిస్టేబుళ్ల రూ.10లక్షలు గుర్తించి.. గంజాయి కేసులో ఇరికిస్తామని బెదిరించి అందులో రూ.6లక్షలు నగదు లాక్కొని అతడిని వదిలేసిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాగా సంబంధిత వ్యాపారి వర్తకసంఘం ద్వారా పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో ఆ నగదు తిరిగి ఇచ్చినట్టు సమాచారం.

ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు అంతర్గతంగా విచారణ చేపట్టి.. అతడిని బెదిరించింది టాస్క్‌ఫోర్స్‌కు చెందిన కానిస్టేబుళ్లుగా గుర్తించారని, ఆ తర్వాత వారిని సీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ అధికారులు మాత్రం దీనిని ధ్రువీకరించలేదు. ఇక ఈ సంఘటనపై వ్యాపారి నుంచి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు చెబుతున్నారు.



ఇంటి పట్టాను అందజేస్తున్న కలెక్టర్

'డబుల్' ఖుషీ!

- ప్రజావాణి దరఖాస్తుతో ఇల్లు
- తక్షణమే పరిష్కరించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందించిన దరఖాస్తుకు తక్షణమే స్పందించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఓ కుటుంబానికి ఇల్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నగర సమీపంలోని అల్లీపురంలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని కేటాయించారు. ఖమ్మం మండలం ముస్తఫా నగర్‌కు చెందిన తుపాకుల శైలజకు 2022లో వైఎస్సార్ కాలనీలో డబుల్ ఇల్లు మంజూరు అయింది. కాగా, అప్పుడు అనారోగ్య కారణాల వల్ల ఇల్లు తీసుకోలేక పోయామని, తమకు న్యాయం చేయాలని సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్‌ని ఆదేశించారు. దీంతో అల్లీపురంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో (డబుల్ బెడ్ రూమ్) డీ3 బ్లాక్‌లో జీ1 ఇంటిని తుపాకుల శైలజకు కేటాయించారు. సాయంత్రం కలెక్టర్ అనుదీప్ ఇందిరమ్మ ఇంటి పట్టా ధ్రువీకరణ పత్రాన్ని తుపాకుల శైలజ దంపతులకు అందజేశారు. దరఖాస్తు ఇచ్చిన రోజే ఇల్లు రావడంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ఆదమరిస్తే.. అలర్జీ

నేడు ప్రపంచ అలర్జీ దినోత్సవం



ఖమ్మం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మారుతున్న ప్రజల జీవన విధానం, వాతావరణం, ఆహార నియమాల్లో మార్పులతో అలర్జీకి దారితీస్తుంది. గతంతో పోల్చితే కేవలం పదిశాతంగా ఉన్న అలర్జీ క్రమేణా పెరుగుతోంది. తాజాగా నిర్వహించిన సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం, పట్టణ ప్రాంతాల్లో 75శాతం మంది ప్రజలు ఏదో ఒక రకమైన అలర్జీతో బాధపడుతున్నట్లు చర్మ వ్యాధుల నిపుణులు చెబుతున్నారు. అలర్జీల తీవ్రత పెరిగి శరీరంపై దాని ప్రతాపం ప్రారంభించిన తర్వాత కాని వైద్యులను సంప్రదించటం లేదు. సకాలంలో అలర్జీకి వైద్యసేవలు తీసుకోకపోతే దీర్ఘకాలిక వ్యాధిగా మారి ప్రాణాల మీదకు వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కారణం కనుగొనటం కష్టమే



మనిషికి వ్యాధి నిరోధకశక్తి తగ్గటం, కాలుష్యం పెరగటంతో అలర్జీ విజృంభిస్తుంది. అలర్జీ అనేది వినటానికి చిన్నగానే అనిపిస్తున్నా అది చేసే కీడు మనిషిని అతలాకుతలం చేస్తుంది. 200సంవత్సరాలుగా దేశంలో అలర్జీకి వైద్యసేవలు ఉన్నప్పటికీ ఇది ఒక వ్యక్తిలో ఏ రూపంలో వస్తుందనే విషయం కనుగోవటం పెద్ద కష్టమైన పనే. ఎందుకంటే అలెర్జీని కచ్చితంగా గుర్తించేందుకు సరైన వైద్య ప్రమాణికాలు నేటి వరకు అందుబాటులోకి రాలేదు. కాని రోజు రోజుకి అలర్జీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అలర్జీతో బాధపడే వ్యక్తి చెప్పిన రోగలక్షణాల మేరకు వాటిలో అలర్జీ కారకాలను వైద్యులు గుర్తించి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

- జిల్లాలో అధికంగా నీటితోనే రుగ్మతలు
- నీరు, ఆహారం ప్రధాన కారకాలు
- తప్పించుకోవాలంటే జీవన శైలి మారాల్సిందే
- వ్యక్తిగత పరిశుభ్రతే ప్రధానం



80రకాల ఆహార పదార్థాలపై సర్వే

అలర్జీకి మూలకారణాలను గుర్తించేందుకు 80రకాల ఆహార పదార్థాలను ద్రవాలుగా మార్చి రక రకాల ద్రవాలను రోగుల చేతులపై రాస్తారు. ఆ తర్వాత సూదులతో గుచ్చుతారు. ఏ పదార్థంతో అలర్జీ లక్షణాలు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని వైద్యులు మందులు రాస్తారు.

ఫాస్ట్‌ఫుడ్‌తో పెరుగుతున్న రోగుల సంఖ్య

గాలి, దుమ్ము, ధూళి, చలి, ఎండ, కల్తీ ఆహారం, నాన్ వెజ్ ఆహారంతో అలర్జీకి కారణం అవుతాయి. ఇవన్నీ ఇక ఎత్తయితే ఫాస్టుఫుడ్ ఆహారంతో అలర్జీలకు మరింత కారణం అవుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఫాస్టుఫుడ్ ద్వారా అలర్జీ వ్యాధి ఎక్కువగా వస్తోందని వైద్యులు గుర్తించారు. చిన్న పిల్లలు సైతం త్వరగా అలర్జీలకు గురవుతున్నారు.

నీటి ద్వారా వచ్చే అలర్జీలే అధికం..

ఖమ్మం జిల్లాలో నీటి ద్వారా వచ్చే అలర్జీలే అధికంగా ఉన్నాయి. శరీరంలోని అలర్జీ రక్తకణాలు ఉండాల్సిన స్థాయి కంటే ఎక్కువగా ఉంటే అలర్జీ ఆయా కారణాలను బట్టి వ్యాధి లక్షణాలు బయటకు వస్తాయి. అలర్జీలో 12రకాలను వైద్యులను గుర్తించారు. నీటి ద్వారా, వ్యక్తిగత పరిశుభ్రతాలోపం, ఆహారపు అలవాట్లు, ఫాస్టుఫుడ్, మితిమీరిన సమయం తర్వాత తినడం, ఆహారం విషతుల్యం అయి రుగ్మతలకు దారితీస్తున్నాయి. ఇలాంటి కేసులు నిత్యం ఆస్పత్రులకు వస్తూనే ఉన్నాయని ఇటీవల కాలంలో అధికం అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం ఉండగా పట్టణ ప్రాంతాలు, కాలుష్య ప్రాంతాల్లో 75శాతం వరకు ఎలర్జీ ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

డాక్టర్ అమర్‌సింగ్, డెర్మటాలజిస్టు, ఖమ్మం



అలర్జీ అనేది నీటి ద్వారా ఎక్కువగా సంక్రమిస్తోంది. వీటితో పాటుగా గజ్జీ, తామర వంటి రోగులు ఎక్కువగా ఆస్పత్రులకు వస్తుంటారు. సరైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, ఎవరి దుస్తులు వారే వేసుకొవటం, ఒకరి సబ్బులు, టవల్స్ మరొకరు వాడకపోవటం చేయాలి. అలర్జీని ప్రారంభంలోనే గుర్తిస్తే ప్రయోజనం ఉంటుంది. అలర్జీలు ప్రాణాంతకం కాకపోయినప్పటికీ కారణం తెలుసుకొని చికిత్స పొందాలి.



రుణ మాఫీ'కర్'

- లబ్ధిదారుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీల ప్రదర్శన నిలిపివేత
- వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న రుణగ్రహీతలు
- అప్పు తీరని వారి పేర్లు ఉండటమే కారణం

వైరా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రూ.రెండులక్షల రుణమాఫీ లబ్ధిదారులైన రైతుల పేర్లతో ముద్రించిన ఫ్లెక్సీలను గ్రామాల్లో ప్రదర్శించటాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిలిపివేశారు. రుణమాఫీ కాని రైతుల పేర్లు కూడా రుణమాఫీ జాబితా కింద ఫ్లెక్సీల్లో ముద్రించడమే దీనికి ప్రధాన కారణమైంది. రూ.రెండులక్షల రుణమాఫీ కాకపోయినా లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉండటంతో వ్యవసాయశాఖ అధికారులను గ్రామాల్లో రైతులు నిలదీస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. రైతుల నుంచి తాము ఎదుర్కొంటున్న చేదు అనుభవాలను ఏఈవోలు, ఏవోలు తమ ఉన్నతాధికారులకు ఏకరువు పెట్టుకున్నారు. దాంతో ఇప్పటికే మండల వ్యవసాయశాఖ కార్యాలయాలకు చేరిన గ్రామాలవారీ రైతుల రుణమాఫీ జాబితాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటుచేయవద్దని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలొచ్చాయి.

రూ.రెండు లక్షలలోపు రుణాలు ఉన్నా కూడా కొంతమంది రైతులవి మాఫీ కాలేదు. రూ.రెండు లక్షల రుణం ఉన్న ఏఒక్క రైతు రుణాలు కూడా మాఫీ చేయలేదు. 2023లో వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్‌లో రైతులకు బ్యాంకుల్లో ఎంత రుణం ఉన్నా దాంతో నిమిత్తం లేకుండా రూ.రెండులక్షలు రుణమాఫీ చేస్తామని ఆపార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అందుకు భిన్నంగా రూ.రెండులక్షల పైచిలుకు రుణాలున్న రైతులకు పైసా కూడా చెల్లించకుండా పాలకులు చేతులెత్తేశారు.

రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ప్రభుత్వం గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలతో ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి లబ్ధిపొందాలని చేపట్టిన ప్రక్రియ బెడిసికొడుతోంది. రుణమాఫీ కాని రైతుల పేర్లు కూడా రైతుల జాబితాలో ముద్రించటంతో అలాంటి రైతులు వ్యవసాయశాఖ అధికారులను నిలదీస్తున్నారు. వైరా మండలంలోని దాచాపురం, గరికపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని నెమలి, ఉమ్మడదేవరపల్లి రైతుల భూములున్నాయి. ఆభూములు కలిగిన ఏపీ రైతులందరికి రుణమాఫీ జరిగింది. దాచాపురం, గరికపాడుకు చెందిన అనేకమంది రైతుల రుణమాఫీ కాలేదు. ఆరైతుల పేర్లు లబ్ధిదారుల జాబితాగా ఉన్న ఫ్లెక్సీల్లో చేర్చడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో మాత్రమే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన అధికారులు ఆతర్వాత పక్కనపెట్టారు. అన్ని గ్రామాల్లో ఇదే తంతు ఉండటంతో మండల కార్యాలయాలకు చేరిన రుణమాఫీ లబ్ధిదారుల ఫ్లెక్సీలను గ్రామాల్లో ఏర్పాటుచేయవద్దని అధికారులు సూచించారు.



దాచాపురంలో వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటుచేసిన రుణమాఫీ లబ్ధిదారుల జాబితా(ఫైల్)

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

- విద్యుత్ శాఖ భద్రాద్రి జిల్లా అధికారి మహేందర్
- రూ. 100 కోట్లతో సబ్‌స్టేషన్ల అనుసంధానం

చంద్రుగొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ అంతరాయం లేకుండా చేసేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు భద్రాద్రికొత్తగూడెం జిల్లా విద్యుత్ శాఖ అధికారి మహేందర్ తెలిపారు. సోమవారం మండలంలో సబ్‌స్టేషన్ల అనుసంధానం కోసం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఎస్ఈ చంద్రుగొండలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 71 సబ్‌స్టేషన్లను ఉన్నాయని వాటిల్లో ఇప్పటికే 50 సబ్‌స్టేషన్‌లు గతంలోనే అనుసంధానం జరిగిందన్నారు. సుమారు రూ. 100 కోట్లుతో 183 కిలోమీటర్లు లైన్లు ఏర్పాటు చేసి మరో 21 సబ్‌స్టేషన్ల కలిపే ప్రకియ ప్రారంభించామని, వాటిలో 9 స్టేషన్ల పని పూర్తి కాగా మరో 12 సబ్‌స్టేషన్ల పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌కు మరో రెండు సబ్‌స్టేషన్లతో అనుసంధానం చేయటం జరుగుతుందన్నారు. ఈ విధానం వల్ల ఒక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్య ఏర్పడితే ఆ వెనువెంటనే మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సఫరా చేయవచ్చన్నారు. ఈ ప్రక్రియ వల్ల విద్యుత్ అంతరాయం సమస్య తీరుతుందన్నారు. ఎస్ఈ వెంట డీఈలు నందయ్య, వెంకటేశ్వర్లు, ఏడీఈ యాసిన్ తదితరులు ఉన్నారు.



విలేకరులకు వివరాలు తెలుపుతున్న ఎస్ఈ మహేందర్

ఆగమ శాస్త్రం ప్రకారం రామాలయ అభివృద్ధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

(5వ పేజీ తరువాయి)

కోరిక అని, ఆ శ్రీరామచంద్రుడి ఆశీస్సులతో ఇందుకు సంబంధించిన పనులు త్వరగా ప్రారంభించాలని కోరుకుంటున్నట్టు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం రాకుండా చూడాలని తాను సీఎంకు సూచించానని, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి రూ.34 కోట్లు విడుదల చేయగా 40 మంది ఇంటి యజమానులకు చెల్లింపులు జరిపామన్నారు. దశాబ్దాల కాలంగా ఉంటున్న స్థానికులు ఆలయ అభివృద్ధి కోసం తమ ఇళ్లను ఇచ్చారంటూ తుమ్మల వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇంటి యజమానులకు మెరుగైన ప్యాకేజీని ఇచ్చామని, ఈ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేస్తున్న కలెక్టర్ జితేష్‌వి పాటిల్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇళ్లు కోల్పోయిన వారికి స్థలాలను కూడా కేటాయిస్తున్నామని అలాగే దుకాణాలతో జీవనం సాగించే కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

ఓ హోటల్‌లో చాయ్ తాగిన మంత్రి

భద్రాచలం చప్టా దిగువలో ఉన్న ఒక హోటల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు... కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్‌లతో కలిసి చాయ్ తాగారు. ఆలయ పరిసరాలను చూసి వచ్చే సమయంలో వారు ఆ హోటల్ వద్ద ఆగి టీ తాగారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం ఉద్యమకారుల నిరసన తెలిపారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల సమితి, సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాచెస్ మాట్లాడుతూ 1969 సంవత్సరంలో ఉద్యమకారులు పోలీస్ కాల్పుల్లో మృతి చెందారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ25 లక్షల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. అనంతరం ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వరకు వెళ్ళి భద్రాద్రి జిల్లా ఐడీవోసీలో ప్రజావాణిలో ఉద్యమకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సిద్దులు తిప్పన, కాలంగి సర్వోత్తమ్, జయరాజ్, రాంచందర్, గౌస్, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, వీరస్వామి, కామేశ్వరరావు, యాదగిరి, క్రిసాంబయ్య, సత్యనారాయణ, సైలేందర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యమకారులు

సింగరేణిలో సమ్మె సైరన్

- రేపు విధులు బహిష్కరించాలని కార్మిక సంఘాల పిలుపు
- కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దని యాజమాన్యం ప్రచారం
- సమ్మె జరిగితే ఒక్కరోజులో సంస్థకు రూ.76కోట్ల నష్టం

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9వ తేదీన సింగరేణిలో సమ్మె నిర్వహించేందుకు కార్మికసంఘాలు సై అంటున్నాయి. అయితే ఈ సమ్మె వల్ల సింగరేణికి రూ.76కోట్ల నష్టం వస్తుందని, అందువల్ల కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని యాజమాన్యం ప్రచారం చేస్తోంది. దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులంతా భాగస్వాములు కావాలని గత నెల రోజులుగా జాతీయ కార్మికసంఘాలైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ), గోదావరి లోయ బొగ్గుగని కార్మికసంఘం (ఐఎఫ్‌టీయూ), ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)తో పాటు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) పలు కార్మికసంఘాలు జేఏసీగా ఏర్పడి ప్రచారం చేస్తున్నాయి. సమ్మె చేయాల్సిన అవసరాన్ని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాన్ని ఎండగడుతూ సింగరేణి మైన్స్ ఓపెన్‌కాస్టులు, డిపార్టుమెంట్ల వద్ద ప్రచారం చేశారు. విధులకు హజరయ్యే కార్మికులకు గేట్ మీటింగ్‌ల ద్వారా సమ్మెను విజయవంతం చేయాలని కార్మికసంఘాల నాయకులు కోరారు. సమ్మెతో కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఎండ గట్టడం ద్వారా మార్పు తీసుకు రావాలని కార్మికసంఘాలు నిర్ణయించాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సమ్మెకు కార్మికసంఘాలు, విప్లవ కార్మికసంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్మిక సంఘాలకు అనుబంధంగా ఉన్న కాంట్రాక్టుకార్మిక సంఘాలు సైతం ఈ సమ్మెను నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. బుధవారం జరిగే సమ్మెకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కూడా సంఘీభావాన్ని ప్రకటించాయి.

ఒక్కరోజు సమ్మెతో రూ.76కోట్ల నష్టం

సింగరేణిలో కార్మికసంఘాలు నిర్వహించే ఒక్క రోజు సమ్మె కారణంగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయి సంస్థకు రూ.76కోట్ల నష్టం వాటిల్లుతుందని యాజమాన్యం కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచారం చేస్తోంది. యాజమాన్యానికి వచ్చే ఈ నష్టంలో కార్మికులు వేతనాల రూపంలో రూ.13.07కోట్లు నష్టపోతారని సూచిస్తున్నారు. ఒక్కరోజు సమ్మెతో 1.92లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుందని యాజమాన్యం ప్రకటించింది. సమ్మెతో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని, అందువల్ల కార్మికులు సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమ్మెకు దూరంగా ఉండాలని కోరుతున్నారు. ఈ సమ్మెలో సింగరేణి కార్మికులకు సంబంధించిన డిమాండ్లు ఏమీ లేవని, వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున 9వ తేదీన జరిగే సమ్మెకు కార్మిలు దూరంగా ఉండాలని విధులకు హజరుకావాలని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేస్తూ మైన్స్ డిపార్టుమెంట్ల వద్ద వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహించింది.

తగ్గేదే లేదు!

(5వ పేజీ తరువాయి)

వచ్చారు. మీ కమాండెంట్‌కు ఫిర్యాదు చేస్తాం" అంటూ హెచ్చరించారు. ఇదంతా భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని దేవస్థానం భూముల్లో జరిగింది. రెండు రోజుల క్రితం ఇంటి నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసి పనులు చేపట్టవద్దని దేవస్థానం సిబ్బంది చెప్పినా పట్టించుకోకుండా ఆక్రమణదారుడు పనులు చేపడుతున్నట్లు దేవస్థానం అధికారులకు సమాచారం అందింది. దీంతో భద్రాచలం దేవస్థానం ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, రత్నం శ్రీకాంత్‌లతో పాటు ఇతర సిబ్బంది అక్కడికి వెళ్లి పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

దాంతో తెలంగాణ అధికారులు తమ భూముల్లోకి రావద్దని ఆక్రమణదారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన దేవస్థానం సిబ్బందిని వారు ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ విషయంపై యటపాక రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు సరైన రీతిలో స్పందించలేదని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి.

250 కేసుల్లో దేవస్థానానికి అనుకూలంగా తీర్పులు

భద్రాద్రి దేవస్థానానికి పురుషోత్తపట్నంలో ఉన్న 889.50ఎకరాల భూములకు సంబంధించిన వివాదాల్లో గత మూడు దశాబ్దాల్లో వివిధ న్యాయస్థానాలు 250 కేసుల్లో దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు దేవస్థానం అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా 2022లో ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ పురుషోత్తపట్నంలోని 889.50 ఎకరాల భూమిని దేవస్థానానికి అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. దేవస్థానం పేరున ఆన్‌లైన్ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నామని దేవస్థానం సిబ్బంది వాపోతున్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంతో ఏపీ హైకోర్టులో కోర్టు ధిక్కార కేసు పెండింగ్‌లో ఉందని, 'రాష్ట్రీయ వానరసేన' కూడా కోర్టు ధిక్కార కేసు వేసినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. పై రెండు కేసులు ప్రధాన న్యాయమూర్తి, ఏపీ ప్రభుత్వ పరిశీలనలో ఉన్నా అక్రమార్కులు యథేచ్ఛగా రామయ్య భూముల్లో ఆక్రమణలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు.

ఇప్పటి వరకు 60సార్లు ఫిర్యాదు

పురుషోత్తపట్నంలోని రామయ్య భూముల్లో ఆక్రమణలు చోటు చేసుకుంటున్న విషయమై గత ఐదేళ్లలో సుమారు 60సార్లు యటపాక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తాము ఫిర్యాదు చేస్తే కనీసం కేసు నమోదైనట్లు రశీదు కూడా ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. మొత్తం 889.5 ఎకరాల్లో 90 శాతం పైగా భూమి ఆక్రమణలోనే ఉండటం గమనార్హం.. ఇక్కడ దేవస్థానం అధికారులు శ్రీగోకుల రామాన్ని 109 ఎకరాల్లో నిర్మించాలని 2018లో పనులకు శ్రీకారం చుట్టగా కేవలం రెండు ఎకరాల్లోపే ఇందుకు సంబంధించిన పనులు ఇప్పటి వరకు సాగాయంటే పరిస్థితి ఏ రీతిన ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులు, సిబ్బందిపై అక్రమార్కులు భౌతిక దాడులు సైతం చేశారని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి.

పట్టించుకోని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు

పురుషోత్తపట్నం రామయ్య భూమల సమస్య ఇంత జటిలంగా ఉన్నా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడాన్ని రామ భక్తులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. గతంలో అప్పటి అధికార పక్షానికి చెందిన నాయకులు ఆక్రమణలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించారనే ఆరోపణలు రాగా ఏపీలో నేడు అధికారంలో ఉన్న పక్షానికి చెందిన నాయకులు సైతం అదే రీతిలో వ్యవహరిస్తున్నారని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. అటు ఏపీ ప్రభుత్వం ఇటు తెలంగాణ ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూడకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా

ఇన్‌చార్జ్‌గా వంశీచంద్

(5వ పేజీ తరువాయి)

గట్టి పోటీ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న జిల్లాల అధ్యక్షులను మార్చాలని కొందరు.. వారినే ఉంచాలని కొందరు.. సూచిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఇరు జిల్లాలకు డీసీసీ అధ్యక్షులుగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య ఉండగా పొదెం వీరయ్యకు ఇప్పటికే రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థచైర్మన్ పదవి లభించింది. పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు త్వరలోనే ప్రభుత్వ నియాక పదవి వరించే అవకాశం ఉంది. ప్రభుత్వ నియామక పదవుల్లోకి వెళితే పార్టీ పదవులను వదిలిపెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో పార్టీ అధ్యక్షులుగా ఉన్నవారందరికీ ప్రభుత్వ పదవులు ఇచ్చి వేరేనాయకులకు జిల్లా కాంగ్రెస్ పగ్గాలు ఇవ్వాలని పీసీసీ ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటు ఖమ్మం.. అటు భద్రాద్రి జిల్లాల అధ్యక్ష పీఠాలపై రసవత్తర పోరు జరిగే పరిస్థితి ఉంది. ఇటు పార్టీ సంస్థాగత ఎన్నికలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపికలోనూ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా వంశీచంద్‌రెడ్డి కీలక పాత్ర పోషించబోతున్నారు. ముగ్గురు మంత్రులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు పలువురు సీనియర్ల మధ్య ఉమ్మడిజిల్లా కాంగ్రెస్‌ను ఐక్యతగా నడిపించడం వంశీచంద్‌రెడ్డికి పెద్దపరీక్షే కానుంది..

శ్రీ కుసుమ హరినాథ్‌బాబా

ఆలయ పటిష్ఠతకు కృషి చేయాలి

భద్రాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ కుసుమహరినాథ బాబా ఆలయం మట్టి జారడం వలన దేవాలయం కూలిపోయే పరిస్థితి ఉందని తక్షణమే ప్రభుత్వం కల్పించుకొని ఆలయ పటిష్టతకు చర్యలు చేపట్టలని కోరుతూ సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆలయ కమిటీ సభ్యులు వినతపత్రం అందజేశారు. ఇటీవల రామాలయ మాడ వీధుల విస్తరణలో భాగంగా ఇల్లు తొలగిస్తుండటంతో మట్టి జారడం వలన దేవాలయం కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎండోమెంటు కమిషనర్, కలెక్టర్, మంత్రులు కల్పించుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ ఎక్కుండి శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు తంబళ్ల కృష్ణార్జునరావు, శ్రీరంగం నరసింహాచార్యులు, పునుగుపాటి సీత, తంగెళ్ల సుజాత పాల్గొన్నారు.

ఆహార భద్రత కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

» జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్



ఖమ్మం కలెక్టరేట్ జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆహారభద్రత కార్డుదారులు అందరూ రేషన్ షాపులలో ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి చందన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 4,15,905 ఆహార భద్రత కార్డులు ఉన్నాయన్నారు. 12,03,943 మొత్తం యూనిట్లకు గాను 9,64,236 యూనిట్లు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన సభ్యులు అంతా తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పౌరసఫరాల శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాల తనిఖీల్లో నగరంలో హోటల్స్, హాస్టల్స్ రెస్టారెంట్లలో వాణిజ్యసముదాయాల్లో గృహ ఉపయోగానికి వినియోగించే గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు బహిర్గతమవుతుందన్నారు. అలాంటి వారిపై 6 ఏ కేసు నమోదు చేస్తున్నట్లు ఆ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకోనున్నట్లు ఆయన తెలిపారు. వాణిజ్య అవసరాలకు నాన్ డోమెస్టిక్ సిలిండర్లనే వినియోగించాలని సూచించారు.

సాగునీటి కోసం..

వైరా ఆయకట్టు రైతుల ఎదురుచూపు

» వానాకాలం సాగుపై ఎన్నెన్నో ఆశలు

వైరా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నీటి విడుదల కోసం వైరా ఆయకట్టు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా ప్రస్తుతం 16.5అడుగుల నీటిమట్టంతో కళకళలాడుతుంది. దాంతో రైతులు నీరు విడుదల చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీగా వర్షాలు కురిసి ఆల్మట్టి, శ్రీశైలం ప్రాజెక్టులనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దాంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు త్వరలోనే నిండే అవకాశం ఉండటంతో వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులు నీరు విడుదల చేయాలని కోరుతున్నారు. ముందుగా వరినారుమళ్లకు నీళ్లు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ ఏడాది జూన్‌లో ఆయకట్టులో వరి నారుమళ్లకు నీరు విడుదల చేసి జూలైలో నాట్లు పూర్తిచేయిస్తామని ప్రకటించారు. అయితే జూన్ నెల ముగిసినా నీటి విడుదలపై ఇంకా స్పష్టమైన ప్రకటన రాలేదు. ఇప్పటికే ఈనెల పదోతేదీ తర్వాత నీరు విడుదల చేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని అనధికారిక సమాచారం. అయితే అధికారికంగా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. రెండో దశ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే జరుగుతున్న ఆధునీకరణ పనులను పదోతేదీ నాటికి పూర్తిచేసి నీటి సరఫరా చేపట్టాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. మిగిలిన ఆధునీకరణ పనులను ఖరీఫ్ సీజన్ అనంతరం చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్, నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి ఆయకట్టు రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నీటి సరఫరాపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయకట్టు రైతులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.



మోటర్ల కింద పెరిగిన నారుమళ్లు



వైరా రిజర్వాయర్

పోర్చుగల్‌లో ఉపాధి అవకాశాలు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పోర్చుగల్‌లో ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా పోర్చుగల్‌లో హోటల్ మేనేజ్మెంట్, హౌజ్ కీపర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్పా థెరపీ, ఈవెంట్ కో ఆర్డినేటర్ వంటి పోస్టులు ఉన్నాయని తెలిపారు. 21 నుంచి 40ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీరికి 2 నుంచి 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. అభ్యర్థులకు వేతనం రూ.90 వేల నుంచి లక్షా 50 వేల వరకు నెల వేతనం అందుతుందని తెలిపారు. వివరాలకు 9440052592, 9440049937, 9440051452 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్మికుల శ్రమదోపిడీకి ప్రభుత్వ సహకారం

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఒక వైపు కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో అప్రజాస్వామికంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చిందని, మరో వైపు తెలంగాణ, ఏపీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకు 10గంటల పని దినాలను అమలు చేస్తూ జీవోలను విడుదల చేయడం మే డే పోరాట ఫలాన్ని పాతి పెట్టటమే అని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. నూతన కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయకుంటే మాస్‌లైన్, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పని గంటల పెంపుతో కార్పొరేట్ శక్తులకు ఊతం లభిస్తోందన్నారు. పెట్టుబడిదారి వర్గాల ఆర్థిక లాభాల దాహం తీర్చుకునేందుకు ప్రభుత్వాలు కార్మికులపై అదనపు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని ఆరోపించారు. జీవో వెనుక ఎన్నో కార్పొరేట్ శక్తులు ఉన్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే కార్మికుల నిజ వేతనాలు తగ్గి పోతున్నాయని, కార్పొరేట్ వర్గాలకు లాభాల శాతం ఇబ్బడి ముబ్బడిగా పెరుతున్నాయని, ఇలాంటి స్థితిలో కార్మికుల వేతనాలు పెంచి పనిభారం తగ్గించాల్సిన ప్రభుత్వాలు విరుద్ధంగా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చాయని ధ్వజమేత్తారు. ప్రపంచ కార్మికుల పోరాట స్ఫూర్తితో మే డే అమలుచేసిన 8గంటల పని విధానం అమలు చేయాలని లేకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేసి ప్రతిఘటిస్తామన్నారు.

స్థానిక సంస్థల సన్నద్ధం కోసమే

శంఖారావం యాత్ర

» డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నామని, రాష్ట్రంలోనే ముందుగా ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ సమరశంఖారావం యాత్ర ప్రారంభిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సత్తుపల్లిలో యాత్ర ప్రారంభమై పాలేరు నియోజకవర్గంలో ముగుస్తుందన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల పరిశీలనతో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. కార్యక్రమం పర్యవేక్షణ కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ ఇన్‌చార్జీగా రావడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మెక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కొత్తా సీతారాములు, కొంటిముక్కల నాగేశ్వరరావు, వడ్డే నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

'మారెళ్లపాడు'తో పినపాక సస్యశ్యామలం

» వచ్చే యాసంగికి నీరందించేలా చర్యలు
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
» పనుల నిర్వహణలో జాప్యంపై తీవ్ర ఆగ్రహం
» సంబంధిత ఏజెన్సీపై చర్యలకు ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వాపురం జూలై 7(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రబీ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారెళ్లపాడు పూర్తయితే పినపాక నియోజకవర్గంలో కొత్తగా 25వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మారెళ్లపాడు పథకం నిర్మాణ విషయాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. పినపాక నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరుగా పేరొందిన తుమ్మలచెరువుకు గోదావరి జలాలు అందించాలని ఆయకట్టు రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారని, మారెళ్లపాడుతో తుమ్మలచెరువుకు కూడా గోదావరి జలాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

పనుల జాప్యంపై మంత్రి అసహనం

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ నాటికే ఈ పథకం ద్వారా సాగునీరు అందించాల్సి ఉండగా ఇంకా పునాదుల్లోనే పనులు జరుగుతుండడంపై మంత్రి ఫోన్‌లో సీఎంవో అధికారులతో మాట్లాడారు. పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకుని సంబంధింత ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్‌శర్మ, భద్రాచలం ఆర్డీవో దామోదర్, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీవో ముత్యాలరావు, అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక



గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి): యూపీలోని డెహ్రాడూన్‌లో ఈనెల 12 నుంచి 14 వరకు జరగనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలకు తమ కళాశాల విద్యార్థి గౌతమ్ ఎంపికయ్యాడని నయాబజార్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. గౌతమ్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు 'హార్వెస్ట్' విద్యార్థి



చార్వితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎమ్. చార్విత ఎంపికైందని హార్వెస్ట్ పాఠశాల యజమాన్యం తెలిపింది. చార్విత ఈనెల 4న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలలో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు. రాష్ట్ర పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

92కిలోల గంజాయి స్వాధీనం



పామాయిల్‌తోటలో నిల్వచేసిన గంజాయి ప్యాకెట్లు

దమ్మపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి) : భారీవర్షం కారణంగా పామాయిల్‌తోటలో గంజాయి ప్యాకెట్లు బయటపడిన ఘటన మండలంలో సోమవారం వెలుగు చూసింది. దమ్మపేట-అశ్వారావుపేట సరిహద్దు మండలాల పరిదిధిలోని అకినేపల్లి శివారులో ఓ పాయిల్ తోటలో అక్రమంగా నిల్వచేసిన గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జుల వెంకటేశ్వరరావు ఉదయం తనకు చెందిన పామాయిల్ తోటలోకి వెళ్లగా కాల్వలో ప్యాకెట్లు కనిపించాయి. రైతుకు అర్థంకాక వెంటనే స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి సిబ్బంతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని కాల్వలో ఉన్న ప్యాకెట్లు పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు నిల్వచేసిన గంజాయిగా గుర్తించారు. కాల్వలో పామాయిల్ మట్టలు వేసి నిల్వ ఉంచగా భారీవర్షం కారణంగానే గంజాయి ప్యాకెట్లు బయటపడినట్లు అంటున్నారు. గంజాయి స్థానికుల ప్రమేయంతో ఇక్కడ దాచి ఉంచారా... పక్కనే ఏపీ సరిహద్దు ఉండటంతో అక్కడి నుంచి ఇక్కడికి తరిలించి దాచారా.. అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఈవిషయంపై ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డిని వివరణ కోరగా గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. 44ప్యాకెట్లలలో 92కిలోల గంజాయి లభ్యమైందని, దీని విలువ రూ.46.17లక్షలు ఉంటుందని తెలిపారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె హత్య ఘటనలో ఇద్దరికి జీవిత ఖైదు

బోనకల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధంతో తన 11 ఏళ్ల కుమార్తెను హత్య చేసిన కేసులో తల్లితో పాటు తాతకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ సోమవారం సత్తుపల్లి న్యాయాధికారి ఎం. శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి చెందిన పాలేపు సునీత అనే వివాహిత మహిళ తన మామ పాలేపు నరసింహారావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గత 2022, ఫిబ్రవరి 8న ట్రాలీ డ్రైవర్ ఐన భర్త హరికృష్ణ బయటకు వెళ్లిన సమయంలో మామ, కోడలు ఇంట్లో కలిసి ఉండగా ఆమె పెద్ద కుమార్తె చూసింది. ఎలాగైనా బాలికను అడ్డు తొలగించుకోవాలని భావించిన ఇద్దరూ చిన్నారి మెడకు వైరు బిగించి గట్టిగా లాగారు. మరల ఏమి తెలియనట్లుగా భర్తకు ఫోన్ చేసి పెద్ద కుమార్తె ఆరోగ్యం బాగోలేదని, 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అప్పటికే చనిపోయిందని వైద్యులు తెలపడంతో పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమార్తె మెడపై కమిలినట్లు గాట్లు ఉండటంతో బోనకల్ పోలీస్‌స్టేషన్లో గత 2022 ఫిబ్రవరి 9న తండ్రి హరికృష్ణ ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు విచారణ అనంతరం పాలేపు సునీత, నర్సింహారావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును పరిశీలించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ ఎస్‌కె. మహ్మద్, అబ్దుల్ పాషాలు వాదించారు. విచారణాధికారులు నాటి సీఐ ఓ. మురళి, ఎస్‌ఐ టి. కవిత, కోర్టు కానిస్టేబుల్ బి. అరవింద్, కోర్టు లైజనింగ్ అధికారి శ్రీకాంత్‌లను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

పేటలో బత్తాయి పండ్ల లారీ బోల్తా

అశ్వారావుపేట రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో సోమవారం ఉదయం బత్తాయి పండ్ల లారీ బోల్తా పడింది. నల్గొండ జిల్లా హాలియా నుంచి కలకత్తాను వెళుతున్న లారీ జాతీయ రహదారిపై వ్యవసాయ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తాపడింది. ప్రమాదంలో కాయలు అన్నీ బయటకు పడగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బత్తాయిలను మరో లారీలో లోడ్ చేసి కలకత్తాను పంపారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఇల్లెందు టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇల్లెందు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఓ వ్యక్తి పడి ఉండటంతో అతడిని 108 సహాయంతో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు...

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



ప్రణీత్(ఫైల్)

ఇల్లెందురూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి సంఘటన మండలంలో కొల్లాపురం గ్రామంలో జరిగింది. గ్రామస్థుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొల్లాపురం గ్రామానికి చెందిన చీమల ప్రణీత్(21) ఆదివారం రాత్రి పక్క గ్రామంలో బంధువుల ఇంటికి తన స్నేహితుడైన కుంజ జలమయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన ఆగి ఉన్న బోర్‌వెల్ బండికి ఢీ కొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రణీత్‌ను ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం వైద్యశాలకు తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ ప్రణీత్ మృతి చెందాడు.

పురుగుల మందు తాగి మరోకరు ..



వంశీకృష్ణ(ఫైల్)

ఇల్లెందురూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో కొల్లాపురం గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరం వంశీకృష్ణ(24) కుటుంబ కలహాలతో సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకే రోజు గ్రామంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. ఇద్దరు యువకులు గ్రామం తరుపున వాలీబాల్ జట్టులో మంచి ఆటగాళ్లుగా గుర్తింపు పొందారని గ్రామస్థులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

» కాంగ్రెస్ అధికారంలోనే ఉండాలి... బీఆర్ఎస్ బీజేపీ లాగా చెయ్యొద్దు
» కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొణిజర్ల, జూలై7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు చేస్తూనే ఉంటుందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా సమస్యలు విస్మరించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో యాసా వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, కంపసాటి వెంకన్న అధ్యక్షతన మండల 18వ మహాసభను నిర్వహించారు. ముందుగా పార్టీని జెండాను సీనియర్ నాయకుడు వింజం గోపాల కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కూనంనేని మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీలో ఉండాల్సిన వారు జైళ్లల్లో ఉంటున్నారని, జైళ్లల్లో ఉండాల్సిన వాళ్లు పార్లమెంట్, అసెంబ్లీలో ఉంటున్నారని విమర్శించారు. దేశ సంపదను మోదీ ఆదాని, అంబాని చేతుల్లో పెట్టారని, 60శాతం సంపదను వారే అనభవిస్తున్నారని, కేంద్రం పెడుతున్న చట్టాలు వారికి చుట్టాలుగా మారాయని ఎద్దేవచేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బిజెపి విధానాలు నచ్చక కాంగ్రెస్‌తో కలిసిపోవలసి వచ్చిందని, వారి దారిలో కాంగ్రెస్ పడిస్తే కమ్యూనిస్టులుగా సహించమని తెలిపారు. కమ్యూనిస్టుల బలం గట్టిగా ఉంటే ఎవరితోనూ ఉండాల్సిన అవసరం లేదన్నారు. సొంతబలం సరిపోకనే కాంగ్రెస్‌తో ఐక్యత చేయాల్సి వచ్చిందన్నారు. సొంత నియోజకవర్గం అయినప్పటికి కొత్తగూడెంలో అందరికి సహకరిస్తున్నామని, ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులను విస్మరిస్తే సహించమని తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం మేధావులను, కవులను విస్మరిస్తుందని విప్లవకవి వరవరరావును లోపల ఉంచడం సరికాదన్నారు. దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టులు ముందుండాలంటే బల్పడాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కాంగ్రెస ఆలోచించాలని, పేదలను విస్మరిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని తెలిపారు. కమ్యూనిస్టులు లేనిదే కాంగ్రెస్ అధికస్థానాల్లో గెలవదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిగిపో అనటంలేదని, బీఆర్ఎస్, బిజెపి చేసిన పనులు చెయ్యేద్దని చెప్పతున్నామన పరోక్షంగా హెచ్చరించారు. బిజెపికి మతం అడ్డుపెట్టుకోని రాజకీయం చేయటం తప్పా రాజకీయాలు చేయలేదన్నారు. భవిష్యత్‌లో కమ్యూనిస్టులు బల్పడాలంటే బలంగా తయారుకావాలని తెలిపారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కమ్యూనిస్టుల సత్తా చూపాలని తెలిపారు. బలంగా ఉన్నా తనికెళ్ల, అమ్మపాలెం, కొణిజర్ల, తుమ్మపల్లి, రామనర్సయ్యనగర్, పెద్దమునగాల తదితర గ్రామాల్లో ఎర్రజెండా తరుపున గెలిచి చూపించాలని సూచించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ బీఆర్ఎస్, బీజేపీలకు మద్దతు ఇచ్చేదిలేదని అర్థం చేసుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతియసమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, కొండపర్తి గోవిందరరావు, తాటి నిర్మల, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వీవీరావు, వేములకొండ రమేష్, గడల భాస్కర్‌రావు పాల్గొన్నారు.

టీజీవో హౌజ్‌బిల్డింగ్ సొసైటీకి డిపాజిట్ల సేకరణ



సమావేశంలో పాల్గొన్న టీజీవో హౌజ్‌బిల్డింగ్ సొసైటీ సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల హౌజ్ బిల్డింగ్ సొసైటీకి ఇప్పటి వరకు 20 మంది డిపాజిట్లు చెల్లించినట్లు టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగుల ఐకాసా సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సొసైటీ సమావేశాన్ని టీజీవో భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడు కట్టా కిషోర్ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఇప్పటివరకు హౌస్ బిల్డింగ్ సొసైటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులు 1,012 మంది సభ్యులుగా చేరినట్లు తెలిపారు. సొసైటీకి బ్యాంకులో రెండు లక్షల డిపాజిట్స్ 20 మంది తీసుకున్నారని తెలిపారు.. రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ కావలసినవారు ఈనెల 10లోపు ఖమ్మంలోనే ఉన్న వీడియోస్ కాలనీలో ఉన్న ఎస్బీఐలో రూ.రెండు లక్షలు డిపాజిట్ చేసేందుకు చివరి తేదీగా ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. గెజిటెడ్ అధికారులకు మాత్రమే రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 10 లోపు డిపాజిట్ చేసినట్లయితే వారికే ఇవ్వడం జరుగుతుందని, లేకుంటే మిగతా యూనియన్ సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు అవకాశం కల్పించే విధంగా సొసైటీ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ వో జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం జిల్లా ఉద్యోగుల ఐకాస కన్వీనర్ కస్తాలసత్యనారాయణ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్, టీజీవో కార్యదర్శి మోదుగు వేలాద్రి ట్రెజరర్ కొండపల్లి శేష ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, హౌస్ బిల్డింగ్ సొసైటీ ట్రెజరర్ రమేష్, డైరెక్టర్స్ మహేష్ బాబు, సుధారాణి డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

వీఎంబంజర్‌లో చోరీ

పెనుబల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌లో ఓ ఇంట్లో జరిగింది. వీఎంబంజర్‌కు చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు బుక్కా కృష్ణవేణి రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలను పగులగొట్టి ఇంట్లో ఉన్న 8తులాల బంగారం, కేజీ వెండిని అపహరించుకుపోయారు. ఈమేరకు కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పుట్ట గొడుగులు వచ్చేశాయి



పూసుగుప్ప అడవుల్లో దొరికిన పుట్ట గొడుగులు

చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వరప్రసాదాలు ఏమిటి అంటే పుట్టగొడుగులు అని ఇట్టే చెప్పేవొచ్చు. ప్రతీ ఏడాది జూలై నెల్లో ఈ పుట్టగొడుగులు అడవుల్లో లభిస్తుంటాయి. వర్షాలు కురుస్తూ, ఉరుములు, మెరుపులు వస్తున్న సమయం లో మాత్రమే పాముల పుట్టలపై ఈ పుట్ట గొడుగులు భయటకు వస్తాయి. నేల ఎర్రగా ఉండి, చెద పురుగులు ఉన్న పుట్టలపై మాత్రమే ఈ పుట్ట గొడుగులు బయటకు వస్తాయని స్థానికులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పుట్టగొడుగులు అడవుల్లోని పుట్టలపై కనిపిస్తున్నాయి. చాలా మంది ఆదివాసీలు అడవుల్లోకి వెళ్లి వీటిని సేకరిస్తున్నారు. కిలో వెయ్యి రూపాయలు అయినా వాటిని అమ్మే వాళ్లు కనిపించడం లేదు. చాలా మంది అటవీ గ్రామాలకు వెళ్లి వాటిని కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. కాగా ఎవరైనా పుట్ట గొడుగుల సంబందించిన ఫొటోలను వాట్సాప్‌ల్లో పెట్టినా, లేక ఎవరైనా చెప్పినా పుట్ట గొడుగులు ఎక్కడ దొరుకుతున్నాయి అని అనేక మంది ఆరా తీస్తున్నారు. పుట్టగొడుగుల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయ ని, రుచి కూడా బాగుంటుందని అందుకే వాటిని బహుప్రీతిగా తింటారని స్థానికులు చెబుతున్నారు. సోమవారం చర్ల మండలం పూసుగుప్ప అడవుల్లో పుట్ట గొడుగులను సేకరించి వాటిని ఓ ఆదివాసీ తీసుకుని వెళ్తుండగా ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.

బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఓ హోటల్ జరిగిన సంఘం సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గౌరవ సలహాదారుడు గరికపాటి.ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ నూతన కార్యవర్గం 2025 నుంచి2028 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అధ్యక్షుడుగా తుంపాల. కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా వాసిరెడ్డి.నాగేశ్వరరావు, కోశాధికారిగా బాణోతు.ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ రజాక్, నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం ఈ నెలాఖరులో ఉంటుందని తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ సంఘం అధ్యక్షుడిగా కొత్తకొండ



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న జిల్లా నాయకులు

నేలకొండపల్లి,జూలై7(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లి మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తకొండ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ సర్వసభ్య సమావేశం సోమవారం నేలకొండపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగింది. అధ్యక్షుడిగా కొత్తకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా షేక్.మౌలానా,కోశాధికారిగా రామగిరి రవి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని జిల్లాఅధ్యక్షుడు మారగాని వెంకట్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవర నాగరాజు, పిన్నం కనకారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఇందిరమ్మ ఇళ్లు, విద్యాశాఖపై సమీక్ష



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, దీనికి అవసరమైన పటిష్ట ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, విద్యాశాఖ, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్టు కింద వాటిని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మధిర పట్టణంలో జీ+2 మోడల్‌లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. 13ఎకరాల స్థలం గుర్తించామని, అక్కడ 427 ఇళ్లు నిర్మించడానికి ప్రణాళికలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఖమ్మం అర్బన్ మండలం, సత్తుపల్లి, వైరా, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కూడా పెండింగ్ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక బఫర్ జాబితాతో కలిపి సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలి

తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రూపొందించిన సమగ్ర సమాచారంతో బుక్‌లెట్‌ను, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో నిలిపి వేసిన వారికి మరో అవకాశం కల్పిస్తూ 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసేలా తెలంగాణ ఓపెన్ స్కూల్‌సొసైటీ పని చేస్తుందన్నారు. ఈ బుక్ లెట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ అనిల్, సూపరింటెండెంట్ చావా శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్'కు కలెక్టర్ అభినందన

మ్యాక్స్ ఫార్మసీ కళాశాలలో చదువుతున్న దీపిక కాలేజీ ఫీజులు రూ.35వేలను హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మద్దినేని ప్రసాదరావు, కమల అందించారు. ఈ చెక్కును కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా దీపికకు సోమవారం అందించారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థను అభినందించారు. దీపికను కష్టపడి చదివి ఉన్నత స్థాయికి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ యలమద్ది వెంకటేశ్వర్లు, సభ్యులు సిరిపురపు రమణారావు, కొంగర పురుషోత్తం రావు, ఏపూరి నాగేశ్వరరావు, మద్దినేని కమల, సంఘవ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నేలకొండపల్లి, జూలై7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నేలకొండపల్లిలో నిర్వహించారు. మందకృష్ణ నాయకత్వంలో 31సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఎన్నో పోరాటాలు చేసి, ఎన్నోవిజయాలను సాధించిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ జన్మదినం ఒక్కరోజే గావటంతో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు వెంకన్న అన్నారు. కార్యక్రమంలో కిట్టు శ్రీనుమాదిగ,జిల్లపల్లి పాండురంగయ్య, సూరేపల్లి సుందర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఖమ్మంచర్చికాంపౌండ్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలను సోమవారం నగరంలో సోమవారం నిర్వహించారు. నగరంలోని పాతబస్టాండ్, గుట్టలబజార్, తదితర చోట్ల ఎంఆర్‌పీఎస్ జెండాలను నాయకులు ఎగురవేశారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్యమాదిగ, ఎంఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు బాకి శ్రీను, ఎంఎస్‌పీ నగర ఉపాధ్యక్షుడు సూరపల్లి నాగేశ్వరరావుమాదిగ, దేవరకొండ రాముమాదిగ పాల్గొన్నారు.

ఖమ్మం అభివృద్ధిని ఢిల్లీలో వినిపించాం

- అండర్ డ్రైయినేజీ నుంచి డంపింగ్ యార్డు శుద్ధి వరకు వివరించాం
- మేయర్ నీరజ, ఉపమేయర్ ఫాతిమా జోహారా



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో అమలు చేస్తున్న రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులను అమృత్ జాతీయ సదస్సులో వివరించానని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మేయర్ సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారాతో కలిసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న నగర పాలక సంస్థలు సదస్సు జరగగా, రాష్ట్రంనుంచి తాను మాట్లాడే అవకావం దక్కిందన్నారు. రాజకీయాలకు అతీతంగా నగరాలకు నిధులు మంజూరు చేయాలని విన్నవించానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖలు అభివృద్ధి పనుల సందర్భంగా బాధితులకు లబ్ధి చేకూరేలా పరిహారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నగరంలో నిర్మాణంలో ఉన్న అండర్ డ్రెయినేజీ నిర్మాణం, పార్కులు, రహదారులు, డంపింగ్‌యార్డును శుద్ధి చేసి మొక్కలు పెంచటంపై వివరించటం జరిగిందన్నారు. జటాయివు, స్వీపింగ్ మిషన్ల వినియోగంపై వివరించామన్నారు. అమృత్ నగరాల్లో పారిశుధ్య వాహనాలు డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా విద్యుత్, సోలార్ వాహనాలను వాడుతున్నారని త్వరలో ఖమ్మం నగర పాలక సంస్థకు సోలార్‌తో నడిచే విద్యుత్ వాహనాలను కొనుగోలు చేస్తామన్నారు.

మంచుకొండ పీహెచ్‌సీకి వీల్‌చైర్ల వితరణ

రఘునాథపాలెం,జూలై7(ఆంధ్రజ్యోతి): మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వీల్‌చైర్లను వితరణగా అందించారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి బాలకృష్ణ, వైద్య పర్యవేక్షకుడు తాళ్లూరి శ్రీకాంత్ వీల్‌చైర్లు బ్యాంకు అధికారుల నుంచి తీసుకొని పీహెచ్‌సీకి పంపారు.



ప్రతీ దరఖాస్తు పరిష్కరించాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ

ఖమ్మంకార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందించే వినతులు ప్రతీ దరఖాస్తుకు పరిష్కారం చూపాలని సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావినతుల పరిష్కారానికే ప్రజావాణి ఏర్పాటు ఉద్దేశమన్నారు. సమస్యలు పరిష్కారం జరిగితే ప్రజలు పదేపదే ఎందుకు వస్తారని అధికారులను ప్రశ్నించారు.'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ముళ్ల పొదలే మూత్రశాలలు కథనంతో ఖానాపురం ట్యాంక్ బండ్ వాకర్స్ కమిషనర్ అభిషేక్‌ను కలిసి సమస్యలను వివరించారు. మరుగుదొడ్డి నిర్మాణంతో పాటుగా వాకర్స్ దారి మరమ్మతులు చేయించాలని కోరారు. 6వడివిజన్‌లోని ప్రశాంతినగర్‌లో శ్రీకృష్ణ గుడి సమీపంలో మురుగు నీరు వెళ్లక స్థానికుల నివాసాల్లో వస్తున్నాయని, డ్రెయినేజీ వెడల్పు చేసి సమస్యను పరిష్కరించాలని పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్థానికులు విన్నవించారు. రెవెన్యూ సమస్యలకు కొంత సమయం తీసుకునేనా పరిష్కారం చేయాలని, పారిశుధ్యంపై తీసుకున్న చర్యలపై తనకు ఫొటోలు పెట్టాలని కమిషనర్ ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్

దొడ్డి దారిన జీవోల అమలు

- పది గంటల పనిదినాల జీవో ప్రతుల దహనం
- టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులతో ప్రదర్శన, నిరసన



జీవో ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాల్గు లేబర్ కోడ్‌లకు మద్దతుగానే రాష్ట్రప్రభుత్వాలు దొడ్డి దారిన జీవోలను అమలు చేస్తున్నాయని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జీ.రామయ్య విమర్శించారు. రోజుకు పది గంటల పని దినాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శనలు చేపట్టారు.అనంతరం జీవోప్రతులను దహనం చేశారు. రోజుకు 8గంటల పనివిధానం కోసం ప్రపంచ వ్యాప్తంగా వందలాది మంది కార్మికులు బలిదానాలు చేశారని గుర్తు చేశారు. మేడే స్ఫూర్తితో అమలు జరుగుతున్న పనిదినాలను ఇప్పుడు 10గంటలకు పెంచటం కార్మికులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టటమే అన్నారు. తక్షణమే జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కే.శ్రీనివాస్, బాబురావు, కాంతయ్య, నారాయణ, పార్దు కృష్ణ, రమేశ్, రాము, వెంకటేష్, రవి, జగదీష్, రంగయ్య, యాదక్క, యుగంధర్, శ్రీను,కృష్ణ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

నేలకొండపల్లి, జూలై7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఖమ్మానికి చెందిన చిక్కుళ్ల శ్రీకాంత్ దాదాపుగా రూ.20వేల విలువైన నోటు పుస్తకాలను వితరణ చేశారు. శ్రీకాంత్‌తో పాటుగా ఎంఈఓ చలపతిరావు నోటు పుస్తకాలను సోమవారం పాఠశాలలో అందచేశారు. శ్రీకాంత్ అందచేయటం ఎంతో అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు తేజావత్ వెంగళరావు మాట్లాడుతూ విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించిన శ్రీకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి హరీష్, మాజీ సర్పంచ్ గండు సతీష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నోట్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో

10న కలెక్టరేట్ ముట్టడి: ఎస్ఎఫ్ఐ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో రూ.8,158కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు అందాల్సి ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు హరీష్, భాను, త్రినాథ్, సుశాంత్, వంశీ, మణికంఠ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై 7(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యమని కొండబాల.కోటేశ్వరరావు, మువ్వా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన మూడుపుస్తకాల ఆవిష్కరణకు హాజరయ్యారు. ప్రముఖ కవి ఏనుగు. కిశోర్‌బాబు రచించిన అడ్డుగోడలు, నడుస్తున్న చరిత్ర, కిశోర శతకం అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యం కిశోర్‌బాబు పుస్తకాలలో కనిపించిందని కొనియాడారు. సామాన్య వ్యవహారాల నుంచి పార్లమెంట్‌లో జరుగుతున్న వాస్తవ తీరును నిర్భయంగా ఆయన వెల్లడించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ప్రసేన్, లెనిన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు, శ్రీనివాసరావు

నేటితో ముగియనున్న ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్



సర్టిఫికెటన్లు పరిశీలిస్తున్న అధ్యాపకులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ మంగళవారంతో పూర్తికానున్నది. తొలివిడత కౌన్సిలింగ్‌లో విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోని సీట్లు పొందిన కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఖమ్మంలో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల1నుంచి ప్రారంభమైన మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం పూర్తి కానున్నదని కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, ఎప్‌సెట్ కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. సోమవారం వరకు మొత్తం 5700 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోని 5550మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైనట్లు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 32 మంది విద్యార్థులు ఉండగా వారి సరిఫికెట్లను పరిశీలించి రిజక్ట్ చేసినట్లు తెలిపారు. ఏపీలో చదివిన విద్యార్థుల తల్లితండ్రులు తెలంగాణలో 10 సంవత్సరాలుగా నివసిస్తూ ఉండి, వారు రెసిడెన్షియల్ సర్టిఫికెట్ సమర్పిస్తే ఆ విద్యార్థుల సర్టిఫికెట్లు అనుమతిస్తున్నామని చెప్పారు. వారిని నాన్ లోకల్ కింద అనుమతిస్తున్నట్లు తెలిపారు. అటువంటి వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ కానీ మంజూరు కావని తెలిపారు. కళాశాలల పూర్తి ఫీజు చెల్లించి చదువుకొనేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. సోమవారం 800వందల మంది స్లాట్ బుక్ చేసుకోని 760 మంది హాజరైనట్లు తెలిపారు. మంగళవారం 800 వందల మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. రెండోవిడత కౌన్సిలింగ్ ఈనెల26 ఒక్కరోజు మాత్రమే ఉంటుందని, చివరి విడత కౌన్సిలింగ్ ఆగస్టు 6న ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ జాకీరుల్లా, ఎప్‌సెట్ కోఆర్డినేటర్ సుధాకర్ సూచించారు.

సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి నల్లమల



సమావేశంలో పాల్గొన్న నల్లమల

ఖమ్మంవ్యవసాయం, జూలై7(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని గాంధీ కృషి విజ్ఞాన్ కేంద్రం సువర్ణ రైతు భవన్‌లో ఆది, సోమవారాల్లో సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. కర్ణాటక రాష్ట్ర రైతు నాయకుడు కుర్బూ శాంతకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ నుంచి నల్లమల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చించామని ఆయన చెప్పారు. మోదీ మోసపూరిత విధానాలను నిరసిస్తూ 19న ఢిల్లీజంతర్ మంతర్ వద్ద మహాకిసాన్ పంచాయత్‌ను నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది. సమావేశ అనంతరం సాయంత్రం గాంధీ భవన్‌లో కర్ణాటక రైతుల భారీ బహిరంగ సదస్సు జరిగిందని నల్లమల తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, జూలై7(ఆంధ్రజ్యోతి): జూలై9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) నగర నాయకులు అంబేద్కర్ జగదీష్ కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు సైదులు షబ్బీర్, రాధమ్మ, భాను,లలితతదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సహస్రకు కళామయూరి పురస్కారం



విద్యార్థినితో పాఠశాల కరస్పాండెంట్ లావణ్య

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వికాస్ పాఠశాలలో 4వతరగతి విద్యార్థిని జ్ఞానసహస్రకు కళామయూరి పురస్కారం లభించిందని పాఠశాల కరస్పాండెంట్ వై.లావణ్య సోమవారం తెలిపారు. హైదాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం గురుదేవోభవ కార్యక్రమంలో చిన్నారి ప్రతిభ చూపి పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈపురస్కారాన్ని రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా అందించారు.

నగర విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో నగరంలోని పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు గోల్‌డమెడల్స్ అందుకున్నారు. నగరంలోని కవితా డిగ్రీ కళాశాల విద్యార్థులు, బ్రౌన్స్‌ఫార్మసీ, ఆర్జేసీ డిగ్రీకళాశాల, ప్రియదర్శిని డిగ్రీ, పీజీకళాశాల, డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇందుకోసం ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్ జరిగిన కేయు స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

ఏదులాపురం సొసైటీ పాలకవర్గం రద్దు?

ఖమ్మంరూరల్,జూలై7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఏదులాపురం సహకార సంఘం పాలకమండలిని రద్దుచేసి, దాని నిర్వాహణ బాధ్యత పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీకి ప్రభుత్వం అప్పగించనుంది. సోమవారం రాష్ట్రవ్యవసాయ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. గతంలోనే సొసైటీల పాలకమండలి గడువు ముగిసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఆరునెలల గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. ఇకనుంచి ఏదులాపురం సొసైటీ బాధ్యత డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ సూపర్వైజర్‌తో పాటు జిల్లా సహకార అధికారి కార్యాలయానికి మరో అధికారి ముగ్గురు సభ్యుల చేత పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

జల్లేపల్లి విద్యార్థికి ట్రిబుల్‌ఐటీలో సీటు

తిరుమలాయపాలెం,జూలై7(ఆంధ్రజ్యోతి):మండలంలోని జల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కుంభం మనీష్‌కుమార్‌కు ట్రిబుల్‌ఐటీలో సీటు లభించింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో మనీష్‌కుమార్ స్థానం సంపాదించాడు. ఈసందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాల హెచ్‌ఎం దారా రాజేష్, ఉపాధ్యాయులు చామకూరి ఉపేందర్ అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

ఏన్కూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్రుతండా గ్రామంలో సోమవారం సాయంత్రం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాంబాబు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ విషయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో అనర్హులు ఎవరైనా ఉంటే తొలిగించాలన్నారు. ఎండీవో జీవీఎస్ నారాయణ పాల్గొన్నారు.

వర్షాలకు గుంతలమయంగా రహదారులు

- ప్రమాదాలను హెచ్చరిస్తూ జెండాలు ఏర్పాటు చేసిన ప్రజలు



వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డులో తాటిపూడి, గొల్లపూడిల్లో ధ్వంసమైన రోడ్ల మధ్యలో ఏర్పాటుచేసిన జెండాలు

వైరా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. అడుగడుగునా గుంతలమయంగా మారాయి. ఈ గుంతల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరికలతో కూడిన సూచికలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన వైరా నడిబొడ్డునున్న క్రాస్‌రోడ్డు మొత్తం ధ్వంసమైపోయింది. రెండు అడుగుల లోతు గుంతలేర్పడ్డాయి. జాతీయ ప్రధాన రహదారి నుంచి మధిర-జగ్గయ్యపేట వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు ఆనవాలు కూడా లేకుండాపోయింది. ఈ రోడ్డుకు రెండువైపులా మూలమలుపుల్లో పైపు లైన్లు లీకవుతూ వాహనాలు దిగబడి పెద్ద గుంతలేర్పడ్డాయి. ఈ గుంతల్లో జరిగే ప్రమాదాలను హెచ్చరిస్తూ గుడ్డతో కూడిన కర్రను స్థానికులు ఏర్పాటుచేశారు. దీన్నిబట్టే రోడ్డు అధ్వాన పరిస్థితి అర్థమవుతోంది. మధిర-జగ్గయ్యపేట రోడ్డులో తాటిపూడి, గొల్లపూడి గ్రామాల్లో రోడ్డు మొత్తం పూర్తిగా ధ్వంసమైంది. రెండు, మూడు అడుగుల లోతుతో గుంతలేర్పడ్డాయి. ద్విచక్రవాహన చోదకులు గుంతల్లో పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఆటోలు, కార్లు గుంతల్లో గుద్దుకొని దెబ్బతింటున్నాయి. నిత్యం వేలాది లారీలు ఇతర వాహనాలు ఈ రూట్లో రాకపోకలు కొనసాగిస్తున్నాయి. తాటిపూడి, గొల్లపూడిలోని గుంతల వద్ద స్థానికులు క్యారీబ్యాగులు, గుడ్డలతో ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు. ఇకపోతే వైరా-నెమలి రూట్లో స్టేజీ పినపాక-సిరిపురం గ్రామాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే టిప్పర్లు తిరిగి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు మొత్తం కుంగిపోయి గుంతలతో నిండి ఉంది. రెబ్బవరం-నెమలి రూట్లో ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. కనీసం వీటికి తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ఈ రోడ్లపై తిరిగే వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యాన, వ్యవసాయ అధికారులు

మధిర రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఆయిల్‌ఫామ్ పంట లాభదాయకమని, ఒకసారి నాటితే 30సంవత్సరాల వరకు ఆదాయాన్ని ఇస్తుందని మధిర ఉద్యానవన అధికారి విష్ణు, వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ తెలిపారు. సోమవారం మధిర మండలం సిద్ధినేనిగూడెం గ్రామంలో రైతు సూరంశెట్టి కిషోర్‌కు చెందిన పొలంలో ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం రూ.200విలువగల మొక్కను రాయితీపై రూ.20కు ఇవ్వడంతోపాటు నాలుగు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి సంవత్సరం ఎకరాకు రూ.4200ఇస్తుందని తెలిపారు. రైతులు ఈ సాగుపై మక్కువ పెంచుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



మధిరలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మధిర రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మధిర పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎంఆర్పీఎస్ నాయకులు ఏసుక, స్వామి, ప్రకాశరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోనకల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం, బోనకల్, రాయనపేట, కలకోట, ఆళ్లపాడు, లక్ష్మీపురం, మోటమర్రి తదితర గ్రామాల్లో సోమవారం ఎంఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌పీ జిల్లా ప్రదాన కార్యదర్శి కోట హనుమంతరావు, నాయకులు తాటికొండ వెంకటరత్నం, చిన్నసైదులు, నర్సింహారావు, గంగాదర్, సాల్మన్ పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్‌మాదిగ, కొండూరు రాజేష్‌మాదిగ, ప్రభావతిరెడ్డి, పొన్నం హరికృష్ణ భూక్యా సక్రునాయక్, మైసారావ, శ్రీనుమాదిగ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మంద కృష్ణ జన్మదిన వేడుకలు

తల్లాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడకలను సోమవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టులు రోబో, బాబురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గవర్నర్ అభినందనలు



గవర్నర్ చేతుల మీదగా బంగారు పతకాలు అందుకున్న నవభారత్ విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్సీ బీఎస్సీల్లో అత్యధిక మార్కులు సాధించినందుకుగానూ బంగారు పతకాలు అందుకున్న నవభారత్ కళాశాల విద్యార్థులను గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ అభినందించారు. సోమవారం వరంగల్‌లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో ఆయన చేతులమీదుగా 7పతకాలను విద్యార్థులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని 473కళాశాలలు ఉండగా ఒకేసారి కెమిస్ట్రీలో 3, బీఎస్సీలో 4గోల్డ్ మెడల్స్ సాధించిన ఏకైక కళాశాల ఇదే అన్నారు. కళాశాల ఛైర్మన్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది వారిని అభినందించారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

బోనకల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. బోనకల్ రైతువేదికలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఎల్‌వోల శిక్షణా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఓటు నమోదుకు ఫారం-6ను ఉపయోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. అనంతరం బీఎల్‌వోలకు పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ డేవిడ్ కరుణాకర్, శిక్షకులు ఎండీ రఫీ, జే. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

- ఫైల్‌తండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే



ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే

కారేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో ఎక్కడకూడా పేదవారుఇల్లు లేకుండా ఇబ్బందులు పడకుండ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జైత్రాంతండా, ఫైల్‌తండాలలో పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు, ఇందిరమ్మ లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్ధానాలను నేర్చుకుంటు వస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు సమిష్టగ ముందుకు సాగుతున్నట్లు ఆయన అన్నారు. అధికారులు నిరంతరం పంచాయతీలలో పర్యవేక్షిస్తు పేదవారిని గుర్తిస్తారని, ఇందిరమ్మ గ్రామకమిటీల సమక్ష్యంలోనే ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఎవ్వరూ ఇల్లు రాలేదనే బావనకు రావద్దన్నారు. ఇండ్లు వచ్చేంత వరకు ఓపికపట్టాలని సూచించారు. ఇండ్లకోసం ఎవరికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. తన కోటకింద 250ఇండ్లు మంజూరు అయినట్లు వాటిని కూడా పేదవారికి ఇవ్వడం జరుగుతందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్,తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ రవీంద్రప్రసాద్,ఏఈ నాగేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా రాంమూర్తి నాయక్,మాజీ ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను అభినందించిన ఎంఈవో

ఏన్కూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మహిళ ఉపాధ్యాయులను మండల విద్యాధికారి రహీంబీ అభినందించారు. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు పెంపు, పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతతోపాటు, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించేందుకు విశేష కృషి చేసినందుకు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఉత్సాహంతో మున్ముందు పనిచేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినీలతో మాట్లాడారు. హెచ్‌ఎం చంద్రిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా భాస్కర్‌రావు

కొణిజర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో జరిగిన సీపీఐ మండల 18వ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా తనికెళ్ళ గ్రామానికి చెందిన గడల భాస్కర్‌రావును, సహాయకార్యదర్శులుగా స్వర్ణ రమేష్, కోటి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లును ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మరో 18 మందితో కార్యవర్గంను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గడల భాస్కర్‌రావు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నూతన్‌కల్ వాసికి ఎల్‌ఎల్‌బీలో గోల్డ్‌మెడల్



మెడల్స్‌తో మధు

తల్లాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎల్‌బీలో అత్యధిక మార్కులు సాధించి అత్యంత ప్రతిభ చాటుకున్న తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామానికి చెందిన కళ్యాణపు మధు రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. సోమవారం వరంగల్‌కాకతీయ యూనివర్శిటీ ఆడిటోరియంలో జరిగిన ప్రధానోత్సవ కార్యక్రమంలో మధుకు రెండు గోల్డ్ మెడల్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రదానం చేశారు.

పాఠశాలలను సందర్శించిన పీఆర్టీయూ నాయకులు

పెనుబల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు పాఠశాలలను నాయకులు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతులతోపాటు బదిలీలు కూడా చేపట్టాలని, బదిలీల తర్వాత మాత్రమే పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, డీఏను ప్రకటించాలని, రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు అప్పారావు, మురళీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాగప్రసాద్, శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌బాబు, మహేష్, వెంకటేశ్వరరావు, ఆంథోని, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మధిర రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మధిర ఏఎంసీ ఛైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. సోమవారం మధిరలోని మార్కెట్ యార్డులో జరుగుతున్న మిర్చి కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో మధిర మార్కెట్‌ను రెగ్యులర్ మార్కెట్‌గా చేస్తామన్నారు. ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులందరికి రైతుభరోసా ఇవ్వడం జరిగిందన్నారు.

యువ విద్యావేత్తకు పీహెచ్‌డీ ప్రదానం



తులసీరామ్

తల్లాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యువ విద్యావేత్త సరికొండ తులసీరామ్ పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి అందుకున్నారు. సోమవారం వరంగల్ కాకతీయ యూనివర్శిటీ 23వ వార్సికోత్సవంలో తులసీరామ్‌కు గవర్నర్ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ చెల్లింపులు విదానాలు అన్వయించుకునే స్థితి-గ్రామీణ మార్కెట్‌లో ఒక అధ్యయనం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తులసీరామ్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన తులసీరామ్‌ను మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్ తదితరులు అభినందించారు.

108లో మహిళ ప్రసవం

మధిర రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మర్లపాడు గ్రామావాసి సంధ్యారాణి అనే మహిళ సోమవారం సాయంత్రం పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో 108సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. 108సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్ల వితరణ

కల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కప్పలబంధం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం దాత జిల్లెల భాస్కరరెడ్డి విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, ప్లేట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు వాటిని అందజేశారు. దాత భాస్కరరెడ్డిని పలువురు అభినందంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు జిల్లెల కృష్ణారెడ్డి, గోపిరెడ్డి, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, పోట్రు అర్జునరావు, ఆళ్లకుంట నరిసింహారావు, నర్సిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రామకోట్వేరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై మహిళా కూలీలతో ఆరా

కల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని కప్పలబంధం గ్రామంలో మార్గ మధ్యలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మహిళా కూలీలతో కలిసి ముచ్చటించటమే కాకుండ వారితో కలిసి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, ప్రత్యేకంగా మహిళలకు అందుతున్న పథకాల గురించి ప్రతి ఒక్క మహిళా కూలీని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయిలకే గ్యాస్ వంటి తదితర పథకాల గురించి ఆయన మహిళా కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పథకాలు తమ కుటుంబాల్లో ఆర్థిక చేయూత నిస్తున్నాయని కూలీలు సంతృతప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆనందరంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి ఛైర్మన్ బాగం నీజదేవి, ఆళ్ల నరిసింహారావు, మట్టా రామకృష్ణ, పొన్నూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి సహకరించాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

వేంసూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. వేంసూరు మండలం మద్దులగూడెం గ్రామంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కాసర చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వైరా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు పాటుపడాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోమవారం జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల నుంచి గ్రామస్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు చేపట్టిన యాత్రకు వైరాలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. జిల్లాలోని అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు బొళ్ల గంగారావు, వీరంశెట్టి సీతరాములు, పమ్మి అశోక్, పల్లపు కొండలు, శీలం చంద్రశేఖరరెడ్డి, ధార్న రాజశేఖర్, తోటకూర గోపి, శబరీనాథ్, శీలం చంద్రశేఖరరెడ్డి, తేళ్లూరి వీరయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను భూస్థాపితం చేయాలి

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- కార్యకర్తలు సమీష్టిగా పనిచేయాలి
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిస్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం ద్వారా బీఆర్‌ఎస్‌ను భూస్థాపితం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు అధ్యక్షతన సత్తుపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని, స్థానిక ఎన్నికలలో పోటీ చేసేందుకు కూడా బీఆర్‌ఎస్ నాయకులు భయపడుతున్నారని రాగమయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, చేసిన పనులను, ప్రజలకు జరిగిన లబ్ధిని ప్రతిఇంటికి వివరించాలని సూచించారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, 200యూనిటట్ల లోపు ఉచిత విద్యుత్ లాంటి పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. ఇన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరుగుతున్నా ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూడలేక బీజేపీ, బీఆర్‌ఎస్ తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్‌ను సంస్థాగతంగా పటిష్ఠం చేసే క్రమంలో గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. స్థానిక సంస్థలలో నూరుశాతం విజయం సాధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పేరుతో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి ఇచ్చిన హామీలు అమలుకు అవసరమైన వనరులను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమీకరిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి స్థానిక సంస్థలు, పార్టీ సంస్థాగత పదవులు అన్నీ కలిపి నియోజకవర్గంలో 5వేల వరకు ఉంటాయని, కష్టపడిన కార్యకర్తలకు ఆయా పదవులలో అవకాశాలు దక్కుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ కల్లూరు కార్యదర్శిగా దయాకర్



కల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల సీపీఐ కార్యదర్శిగా దమాల దయాకర్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కల్లూరులో ఏర్పాటైన మండల పార్టీ సమావేశంలో దయాకర్ ఎంపిక జరిగింది. ఆయనతో పాటుగా మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుగా వేము రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా వేము నాగమణి, దామాల జ్యోతి, పాగా సత్యవతి, యద్దనపూడి పిచ్చయ్య, పోగల భద్రయ్య, కంభంపాటి వెంకటలక్ష్మీ, కట్టా మాధవరావు, ఉబ్బన నాగమణి, రేణుక ఇతరులు ఎన్నికయ్యారు. సీపీఐ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు దయాకర్‌కు అభినందించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి బైక్ ర్యాలీలు



పెనుబల్లిలో సాగుతున్న బైక్‌ర్యాలీ

వైరా/పెనుబల్లి/మధిర రూరల్/తల్లాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం, కాంగ్రెస్, సీపీఐ, తెలుగుదేశం పార్టీలు వాటి అనుబంధ సంఘాల నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. లేబర్ కోడ్‌లను వెనక్కు తీసుకొని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మె నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా చేపటిటన సమ్మెను విజయవంతం చేయాలన్నారు.బైక్‌ర్యాలీ కార్యాక్రమాల్లో సీపీఐ, అనుబంధ సంస్థలు పాల్గొన్నాయి.

భూ నిర్వాసితులకు నష్టపరిహారమేదీ?



ఇటీవల వ్యవసాయమంత్రి తుమ్మలనుకలిసిన బాధిత రైతులు

ఏన్కూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఏన్కూరు లింక్ కెనాల్ పెండింగ్ భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. ఈప్రాజెక్టు కింద సుమారు వందమంది రైతులు భూములు కోల్పోయారు. వీరిలో 80మంది రైతులకు ఏప్రిల్‌లో నష్టపరిహారం అందించారు. వివిధ కారణాలతో 20మంది రైతులకు సుమారు రూ.2.50కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటి కోసం రైతులు వ్యవవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌లకు అనేకసార్లు విన్నపించినా ఫలితం లేదు. వారు స్పందించి వెంటనే నష్టపరిహారం అందేటట్లు చూడాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. ఈకార్యక్రమంలో రైతులు శోభన్‌నాయక్, మేడ ధర్మారావు, శ్రీహరి, మాలోతు నరసింహారావు, యండ్రాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాల్వలను పునరుద్ధరించాలి



కలెక్టర్‌కు వినతి ఇచ్చిన అనంతరం కార్యాలయం ముందు రైతులు

వైరా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన ఉన్న తమ పంటపొలాలకు రహదారులు, సాగునీటి కాల్వలను పునరుద్ధరణ చేయాలని కోరుతూ వైరా మునిసిపాలిటీ పరిధిలోని గండగలపాడు రైతులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఒక వినతిపత్రం సమర్పించారు. రైతుసంఘం ఆధ్వర్యంలో గండగలపాడు రైతులు కలెక్టర్‌కు ఈ వినతిపత్రం అందజేశారు. గ్రీన్‌పీల్డ్ హైవే నిర్మాణం వల్ల తమ భూములకు రహదారులు, పంటకాల్వలు లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన రహదారులు, పంటకాల్వలను పునరుద్ధరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని, సర్వీస్ రోడ్ల ప్రతిపాదనలు తయారు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆతర్వాత నేషనల్ హైవే అథార్టీ అధికారిణి దివ్యను కలిసి మరో వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభావంతుడికి ల్యాప్‌టాప్ వితరణ

కొణిజర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామానకి చెందిన వసుపులేటి లాలుకి ఇంటర్మీడియేట్‌లో 988 మార్కులు సాధించినందుగాకు గాను గ్రామానికి చెందిన టివి చౌదిరి కుమారుడు లెనిన్ రూ. 60వేలు విలువ చేసే ల్యాబ్‌ట్యాబ్‌ను వితరణ చేశారు. దానిని సోమవారం విద్యార్థి లాలుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, యాసా వెంకటేశ్వరరావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు జీవో అమానుషం

మధిర రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పనిగంటల జీవో 282ను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధిరలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. పనిగంటలు పెంచుతూ కేంద్రం తెచ్చిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు పెంచడం కోసం కార్మికుల శ్రమను దోపిడీ చేయటం కోసం పనిగంటల పెంపు చేపట్టారన్నారు. సీపీఎం నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, టి.రాధాకృష్ణ, పెంటి వెంకట్రావ్, పడకంటి మురళీ పాల్గొన్నారు.